కేసీఆర్‌పై కేసు కొట్టివేత

14ఏండ్ల తర్వాత కేసును కొట్టివేయడంపై న్యాయవాదుల హర్షం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): 2011లో తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై నమోదైన కేసును కొట్టివేస్తూ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు గురువారం సంచలన తీర్పు వెల్లడించింది. తెలంగాణ ఉద్యమంలో రైల్‌రోకో కార్యక్రమంలో ప్రయాణికులు, రైలు సిబ్బందికి ఇబ్బందులు కల్పించారని కేసీఆర్‌తోపాటు, పలువురిపై సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. కేసీఆర్‌పై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై ఉత్తర్వులు వెలువడగా, ఈ మేరకు కేసీఆర్‌పై కేసును కొట్టివేయాలని ప్రజాప్రతినిధుల కోర్టుకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు జారీచేసిన ఉత్తర్వు ప్రతిని న్యాయవాది లక్ష్మణ్ సమర్పించగా, ఉత్తర్వు ఆధారంగా కేసును కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. 14 ఏండ్ల అనంతరం కేసీఆర్‌పై కేసును తొలగించడం హర్షణీయమని న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేశారు.

కృష్ణా జలాల్లో 74% వాడుకున్న ఏపీ

- 24% నీళ్లను కూడా వాడుకోలేని తెలంగాణ
- చేతకాని దద్దమ్మల్లా కాంగ్రెస్ పాలకులు
- ఢిల్లీకి మూటలు పంపడంలో ఉన్న శ్రద్ధ రైతులపై ఎందుకు లేదు?
- మంత్రులు మూతులకు ప్లాస్టర్లు వేసుకున్నారా?
- మరో పోరాటానికి సిద్ధం కావాలి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నాంపల్లిలోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జదదిశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): కృష్ణా నదీ జలాలకు సంబంధించిన కోటాలో ఆంధ్రప్రదేశ్ 74% నీళ్లను వాడుకున్నట్టు కేఆర్‌ఎంబీ ధ్రువీకరించిందని, కానీ, తెలంగాణ ప్రభుత్వం 24% నీటిని కూడా వాడుకోవడం లేదని మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం మరోసారి బయటపడిందని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన నాంపల్లిలోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇంతకాలం బీఆర్ఎస్ చేస్తున్న వాదనను కేఆర్ఎంబీ రుజువు చేసిందని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ హెచ్చరించిన తర్వాత కూడా ఏపీ 65 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకున్నదని మండిపడ్డారు. ఏపీ జలదోపిడీపై ముఖ్యమంత్రి, మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. చేతకాని దద్దమ్మల్లా ఏపీ సీఎం చంద్రబాబు బూట్లు నాకుతున్నారా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

మంత్రులు మూతులకు ప్లాస్టర్లు వేసుకున్నారా?

ఏపీ జలదోపిడీకి పాల్పడుతుంటే, కృష్ణా పరీవాహక ప్రాంత జిల్లాలకు చెందిన మంత్రులు ఎందుకు నోరు మెదపడం లేదని, తమ మూతులకు ప్లాస్టర్లు వేసుకున్నారా? అని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. కమీషన్లు దండుకోవడానికి సీఎం, మంత్రులు ప్రాధాన్య మిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేతలకు ఢిల్లీకి మూటలు పంపడంలో ఉన్న శ్రద్ధ రైతులపై లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాగునీటికి కూడా కటకట ఏర్పడే పరిస్థితి ఉన్నా మంత్రులు ఎందుకు సమీక్షలు చేయడం లేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో 38 శాతానికిపైగా కృష్ణా జలాలను వాడుకున్నామని వివరించారు. తెలంగాణ హక్కులపై సోయి లేకుండా వ్యవహరిస్తే చరిత్ర క్షమించదని హెచ్చరించారు.

మరో పోరాటానికి సిద్ధం కావాలి

సాగునీరు, తాగునీటి సమస్యలతో సతమతమవుతున్న ప్రస్తుత తరుణంలో తెలంగాణ ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలని జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రాజెక్టులు కేఆర్ఎంబీ చేతికి వెళ్తే ఎంత ప్రమాదమో.. తాము గతంలో చేసిన హెచ్చరికలు ఇప్పుడు నిజమయ్యాయని పేర్కొన్నారు. దీనిపై ముందే హెచ్చరించినా, పట్టించుకోకుండా కృష్ణ జలాలను ఆంధ్రా పాలుచేశారని కాంగ్రెస్ సర్కారు వైఖరిని దుయ్యబట్టారు. తెలంగాణకు ద్రోహం చేసిన సీఎం, మంత్రులు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీళ్ల విషయంలో తెలంగాణకు జరిగిన నష్టాన్ని ఎలా పూడుస్తారో చెప్పాలని నిలదీశారు. కృష్ణా జలాలను తెలంగాణకు దక్కించుకునేందుకు కేసీఆర్ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తారని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు కేటీఆర్ పరామర్శ

బోధన్, ఏప్రిల్ 16: బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, ఆయన సతీమణి ఆయేషా ఫాతిమాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. షకీల్ మాతృమూర్తి ఇటీవల మరణించగా బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన కేటీఆర్ వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేటీఆర్ వెంట మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జాన్సన్ నాయక్, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పొరాదేవి పీఠాధిపతి చంద్రశేఖర్ మహారాజ్‌ను సన్మానించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత తదితరులు

బీఆర్ఎస్‌తోనే బంజారాలకు మంచిరోజులు

- ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కేసీఆర్‌దే : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- సంత్‌శ్రీ చంద్రశేఖర్ మహారాజ్‌కు సన్మానం

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కృషితోనే తెలంగాణలో బంజారాలకు మంచి రోజులు వచ్చాయని, వారి బతుకులు మారాయని ఎమ్మెల్సీ కవిత స్పష్టంచేశారు. అఖిల భారత బంజారాల ఆధ్యాత్మిక గురువు, పొరాదేవి పీఠాధిపతి చంద్రశేఖర్ మహారాజ్ బుధవారం బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను కవిత సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని బంజారాల ఆశీస్సులు కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై ఉన్నాయని, బీఆర్ఎస్ హయాంలో బంజారాల సంక్షేమానికి పెద్ద పీట వేశారని, కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేశారని గుర్తుచేశారు. ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించి చరిత్ర సృష్టించింది కేసీఆరేనని, తెలంగాణలో మూడు వేలకు పైగా తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్దింది కేసీఆరేనని, దేశంలోనే తొలిసారిగా సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే చంద్రవతి, హరిప్రియా నాయక్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాల్యానాయక్, రాంబల్ నాయక్, రామచంద్ర నాయక్, రూప్‌సింగ్, బంజారా పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా దాసోజు ప్రమాణం

- తొలుత గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి
- హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు
- రాజకీయ పునర్జన్మ ప్రసాదించిన కేసీఆర్: దాసోజు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా దాసోజు శ్రవణ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ఆధ్వర్యంలో శాసనమండలి వేదికగా దాసోజు ప్రమాణం చేశారు. తొలుత గన్‌పార్కు వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, మల్లారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎంపీ పద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, యాదవ రెడ్డి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డి, కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, భిక్షమయ్యగౌడ్, బాల్క సుమన్, నేతలు గజ్జెల నగేశ్, గెల్లు శ్రీనివాస్‌యాద్, ఆంజనేయగౌడ్, కిశోర్‌గౌడ్, జయసింహ, సుమిత్రానంద్, కుర్వ విజయ్, సతీశ్, శుభప్రద్ పటేల్, రంగినేని అభిలాశ్, నర్సిరెడ్డి, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరై పుష్పగుచ్ఛాలు అందజేసి దాసోజుకు శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సెక్రటరీ నరసింహాచార్యులు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. గత 18 ఏండ్లుగా రాజకీయ కార్యకర్తగానే ఉన్న తనకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి రాజకీయ పునర్జన్మ ప్రసాదించారని పేర్కొంటూ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం నాంపల్లిలోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ దుర్మార్గ పాలనను అంతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన నేతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దాసోజు శ్రవణ్‌కుమార్. చిత్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని, మహమూద్ అలీ, పద్మారావు, మల్లారెడ్డి తదితరులు

ఐదుగంటలపాటు శ్రవణ్‌రావు విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఓ మీడియా సంస్థ యజమాని శ్రవణ్‌రావును సిట్ అధికారులు ఐదుగంటలపాటు విచారించారు. బుధవారం జూబ్లీహిల్స్ పోలీసుస్టేషనలో ఈ విచారణ కొనసాగింది. ఈ కేసులో ఇప్పటికే శ్రవణ్‌రావును సిట్ అధికారులు మూడుసార్లు విచారించారు. ఈ కేసులో సిట్ శ్రవణ్‌రావును మరోమారు విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

మహాధర్నాలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

'కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి'

కవాడిగూడ, ఏప్రిల్ 16 : రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి డిమాండ్ చేశారు. వర్సిటీల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ.. పాలకవర్గం నిర్లక్ష్యంతోనే కాంట్రాక్ట్ అధ్యాపకులు ధర్నాకు దిగాల్సిన దుస్థితి వచ్చిందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జేఎల్, డీఎల్, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసినట్టు గుర్తుచేశారు. యూనివర్సిటీ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలనుకునే సమయానికి ఎన్నికలు రావడంతో చేయలేకపోయామని తెలిపారు. వీరిని రెగ్యులరైజ్ చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. యూజీసీ నిబంధనలను సవరించి కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని పార్లమెంట్‌లో కోరనున్నట్టు చెప్పారు. ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు యూనివర్సిటీలను ధ్వంసం చేస్తున్నాయని, అది కరెక్ట్ కాదని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యే కూనంనేని కోరారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసేందుకు యూజీసీ నిబంధనలు సడలించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరనున్నట్టు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మహాధర్నాలో జేఏసీ నాయకులు విజయేందర్‌రెడ్డి, ధర్మతేజ, పరశురాం, వేల్పుల కుమార్, ఉపేందర్, తాళ్లపల్లి వెంకటేశ్, చిర్ర రాజు, శ్రీధర్ రెడ్డి, సురేశ్‌నాయక్, దత్తహరి, నారాయణ గుప్తా, శివారెడ్డి, కరుణాకర్, రేష్మారెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1లో పదిమంది సంగతేంది?

- 21,093 మంది పరీక్ష రాస్తే.. 21,103 మందికి ఫలితాలా?
- అదనపు 10 మందిలో రాములు నాయక్ కోడలున్నరా? లేరా?
- గ్రూప్-1లో భారీ స్కాం.. చేతులు మారిన కోట్ల రూపాయలు
- సమగ్ర జ్యుడీషియల్ ఎంక్వయిరీ, సీబీఐ విచారణ జరపాలి
- సీఎం రేవంత్‌రెడ్డి నుంచి బీజేపీ నాయకులకు మూటలు: కౌశిక్

కరీంనగర్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పరీక్షల్లో పెద్ద కుంభకోణం జరిగిందని, వెంటనే రద్దు చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి, టీజీపీఎస్సీ చైర్మన్, సీఎం రేవంత్‌రెడ్డిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద స్కాం జరిగినా కేంద్రం మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. బీజేపీ నేతలు ఈటల రాజేందర్, అరవింద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి మూటలు పంపుతున్నారని ఆరోపించారు.

ఉర్దూలో ఒకరు ఎలా పెరిగారు?

టీజీపీఎస్సీ వెబ్‌సైట్ డాటా ప్రకారం 21,093 మంది పరీక్ష రాస్తే 21,103 మందికి రిజల్ట్ ఎలా ఇచ్చారని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. తన ఆరోపణలపై టీజీపీఎస్సీ అధికారులు స్పందించారని, కానీ పది మంది సంగతి చెప్పలేదని వెల్లడించారు. మార్చి 13న ఇచ్చిన నివేదికలో ఉర్దూ మీడియంలో 9 మంది పరీక్ష రాసినట్టు ఉన్నదని, ఈ నెల 15న పత్రికా ప్రకటనలో 10 మంది పరీక్ష రాసినట్టు చూపారని తెలిపారు. ఒక్కరు ఎలా పెరిగారని ప్రశ్నించారు. ప్రిలిమ్స్‌కు ఇచ్చిన హాల్ టికెట్లు, మెయిన్స్‌కు ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు.

పది మందిలో కాంగ్రెస్ నేత కోడలు?

కాంగ్రెస్ నాయకుడు రాములునాయక్ కోడలుకు 206 ర్యాంక్ రాలేదని చెప్తున్నారని, కానీ ఆమెకు 206 ర్యాంక్, మల్టీజోన్‌లో నంబర్‌వన్ ర్యాంకు వచ్చినట్టు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ చూపుతున్నదని కౌశిక్‌రెడ్డి తెలిపారు. రాములు నాయక్ కోడలు పరీక్ష రాసిన కోఠి సెంటర్‌కు గాంధీభవన్ నుంచి జవాబు పత్రం వచ్చిందనేది స్పష్టంగా తెలుస్తున్నదని ఆరోపించారు. ఫలితాల్లో అదనంగా చేరిన 10 మందిలో ఆమె ఉందనే అనుమానం ఉన్నదని, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మార్కుల లిస్ట్ ఆన్‌లైన్‌లో ఎందుకు పెట్టలే?

నోటిఫికేషన్ ఇచ్చినపుడు మార్క్స్ లిస్ట్‌ను ఆన్‌లైన్‌లో పెడతామని చెప్పి, అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఎందుకు పంపించారని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. గ్రూప్-1 రాసిన అమ్మాయి పేరును ప్రెస్‌మీట్‌లో ప్రస్తావించినందుకు ఆమెపై కక్ష కట్టారని, ఆమెకు 483 మార్కులు మొదట వచ్చాయని, రీకౌంటింగ్‌కు వెళ్లితే 423 మార్కులు ఇచ్చారని, 60 మార్కుల తేడా ఏ రీకౌంటింగ్‌లోనైనా చూపారా? అని ప్రశ్నించారు. ఇలా ఎందుకుచేశారని అడిగితే.. ఆ అమ్మాయి ఫోర్జరీ చేసిందని అధికారులు చెబుతున్నారని, గ్రూప్-1 పరీక్షలకు ఫోర్జరీ చేసే అవకాశం ఉందా? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే!

కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్‌ఫ్లాప్ అయిందని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా స్కాంలు చేస్తున్నదని కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. తమిళనాడులో 2021 డిసెంబర్ 3న గ్రూప్-4 నిర్వహించారని, రెండుసెంటర్లలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వస్తే పరీక్షలు రద్దు చేసి సీబీఐ విచారణ చేపట్టారని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు గ్రూప్-1 పరీక్షల్లో తప్పు జరిగిందని వచ్చిన ఆరోపణలపై స్పందించిన కేసీఆర్ వెంటనే రద్దు చేసి తిరిగి నోటిఫికేషన్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పుడు ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఎగిరెగిరిపడ్డారని, ఇప్పుడు కేంద్రమంత్రిగా ఉండీ మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సహకారంతోనే గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. పరీక్ష రద్దుచేసి జ్యుడీషియల్, సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

కోఠి ఉమెన్స్.. స్కాం సెంటర్?

కోఠి ఉమెన్స్ కాలేజీ పరీక్ష హాల్లో 1,437 మంది పరీక్షలు రాస్తే 74 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, మిగతా 25 సెంటర్లలో 10,135 మంది పరీక్షలు రాస్తే 69 మంది మాత్రమే ఎంపికయ్యారని తెలిపారు. ఈ సెంటర్‌లోనే పక్కాగా స్కాం జరిగిందని ఆరోపించారు. కోఠిలో పరీక్ష రాసేందుకు పురుషులకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని అడిగితే, అందులో పురుషులకు మూత్రశాలలు లేవని సిల్లీగా సమాధానం చెప్పారని తెలిపారు. ఇంతకన్నా పెద్ద జోక్ మరొకటి లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని మిగతా ఉమెన్స్ కాలేజీల్లో పురుషులు, మహిళలు కలిసి పరీక్షలు రాసిన విషయాన్ని గుర్తుచేశారు.

సమగ్ర విచారణ జరిపించాలి : గంగుల

గ్రూప్-1లో అవకతవకలు జరిగాయని ప్రతిపక్ష పార్టీగా పూర్తి ఆధారాలతో బయటపెట్టామని, దీనిపై సమగ్ర విచారణ జరపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఒకరిద్దరు నాయకులు, అధికారులు తప్పు చేస్తే చాలా మంది నిరుద్యోగుల జీవితాలు వ్యర్థమవుతాయని, అసెంబ్లీలో చాలా సార్లు ప్రశ్నించినపుడు సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఎలాంటి సూచనలు, సలహాలైనా స్వీకరిస్తామని చెప్పారని, ఇప్పుడు గ్రూప్-1లో తప్పు జరిగిందని కౌశిక్‌రెడ్డి చాలా స్పష్టంగా చెబుతున్నారని, రేవంత్‌రెడ్డి సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, నాయకుడు నేతి రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం

- నిబంధనలకు లోబడే నియామకాలు: టీజీపీఎస్సీ

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1లో విజయం సాధించని కొందరు , కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఉద్దేశపూర్వకంగా వదంతులు, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని టీజీపీఎస్సీ తెలిపింది. అభ్యర్థులు ఇలాంటి ప్రచారాన్ని నమ్మెద్దని కమిషన్ ప్రకటనలో కోరింది. రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేయకున్నా మార్కులు తగ్గాయని కొందరు చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని, రాజ్యాంగబద్ధ సంస్థగా, నిబంధనలకు లోబడి నియామక ప్రక్రియను చేపడుతున్నట్టు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. మెయిన్స్ జవాబుపత్రాలను వర్సిటీల్లోని సమర్థులైన, రెగ్యులర్ ఫ్యాకల్టీచే మూల్యాంకనం చేయించినట్టు వెల్లడించారు. కోఠి మహిళా కాలేజీ అభ్యర్థన మేరకు మహిళలకు మాత్రమే టాయిలెట్ వసతి ఉండటంతో వారికే మాత్రమే కేటాయించామని తెలిపారు. మహిళా అభ్యర్థుల్లో 25% మంది 18, 19 నంబర్ గల సెంటర్లలో పరీక్షలకు హాజరయ్యారని, ఎంపికలోనూ కూడా ఎక్కువ నిష్పత్తిలో వారే ఉన్నట్టు పేర్కొన్నారు. ఎస్టీ క్యాటగిరీ టాప్ ర్యాంకర్ ఎరుకుల కులానికి చెందిన వారని తెలిపారు. ప్రిలిమ్స్ హాల్‌టికెట్లలో జిల్లా కోడ్, సెంటర్ కోడ్ ఉండటం చేత మెయిన్స్‌కు వేరే హాల్‌టికెట్ ఇచ్చినట్టు వెల్లడించారు. ఉర్దూలో 10 మంది రాయగా, ఒక్కరు మాత్రమే ఎంపికైనట్టు వివరించారు. పోటీ పరీక్షల్లో కొందరు అభ్యర్థులకు సమాన మార్కులు రావడం సహజమని, మొత్తం మార్కులు సమానంగా ఉన్నప్పటికీ సబ్జెక్టుల్లో వేర్వేరు మార్కులొచ్చాయని తెలిపారు. పూజా తారెడ్డి అనే అభ్యర్థి మార్కులు ఫోర్జరీ చేసి రీ కౌంటింగ్ తర్వాత మార్కులు తగ్గాయని లేఖ రాశారని, ఫోర్జరీ పత్రాన్ని సమర్పించినందుకు షోకాజ్ నోటీసు జారీచేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం 1:1 చొప్పున సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలిచినా, ఏదైనా క్యాటగిరీలో అభ్యర్థులు లేకుంటే తదుపరి అభ్యర్థిని పిలుస్తామని తెలిపారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 16. టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. 17,19,21,22 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగనున్నది.

హామీలపై నిలదీస్తే లాఠీచార్జ్

- షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రభస
- తులం బంగారంపై మంత్రి జూపల్లిని నిలదీసిన వేముల
- అరుపులతో కాంగ్రెస్ గందరగోళం
- బీఆర్ఎస్ శ్రేణులపై లాఠీచార్జ్
- నిరసనగా ప్రశాంత్‌రెడ్డి ధర్నా

నిజామాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండల కేంద్రంలో బుధవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యం ప్రదర్శించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలోనే అప్రజాస్వామికంగా వ్యవహరించారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి జూపల్లితోపాటు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. అధికార పార్టీ నేతలు కుప్పలు తెప్పలుగా పాల్గొనడంపై వేముల అభ్యంతరంతో వారిని బయటకు పంపించారు. అనంతరం వేముల మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బాల్కొండ నియోజకవర్గంలో సుమారు రెండు వేలమందికి షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారని, వీరికి తులం బంగారం ఎప్పుడు ఇస్తారని మంత్రి జూపల్లిని మర్యాదపూర్వకంగా అడిగారు. మంత్రి స్పందిస్తూ, అప్పుల గురించి మాట్లాడి, తులం బంగారం హామీపై దాటవేశారు. వేముల కలుగజేసుకుని నేరుగా సమాధానం చెప్పాలని కోరారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు అరుపులు కేకలతో గందరగోళం సృష్టించారు. బీఆర్ఎస్ నేతలు కూడా ప్రతిగా స్పందించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలను వదిలి, బీఆర్ఎస్ శ్రేణులపైనే పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఫంక్షన్ హాలు నుంచి బయటకు పరుగులు తీసే వరకూ